క్లుప్తంగా

నాణ్యతతో పనులు చేపట్టాలి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్థానిక డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. శనివారం ఆయన డివిజన్ పరిధిలోని విజయపురి కాలనీ ఫేజ్–1లో ప్రారంభించిన సీసీ రోడ్డు పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు శర్మ, రంగప్ప, కేఎస్ శర్మ, కృష్ణగౌడ్, శ్రీనివాస్, నాయకులు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూములను కాపాడండి

హయత్‌నగర్: అన్మగల్ హయత్‌నగర్‌లోని వక్ఫ్ బోర్డుకు చెందిన భూమిని కొందరు ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని, అధికారులు వెంటనే స్పందించి ఆ భూమిని పరిరక్షించాలని టీపీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్ శనివారం వక్ఫ్ బోర్డులో వినతి పత్రం సమర్పించారు. సర్వే నంబర్ 88, 89, 145ల్లో సుమారు 3.36 ఎకరాల భూమి ఉందని, ఈ భూమిలో గతంలో కొందరు ముస్లిలు మసీద్ నిర్మాణానికి యత్నించగా కబ్జాదారులు వారిని బెదిరించి పంపేశారన్నారు. ఆక్రమణదారులు ఇక్కడ ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని కొంతమంది వద్ద డబ్బులు కూడా వసూలు చేశారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇళ్ల స్థలాల ఆశలో పేదలు మోసపోకుండా ఉండేందుకు వక్ఫ్ బోర్డు వారు వెంటనే ఆ భూమిని స్వాధీనం చేసుకోవడంతో పాటు డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని భాస్కర్ డిమాండ్ చేశాడు.

సోషల్ మీడియాలో వచ్చిన వార్తల్లో నిజం లేదు

- వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రంజిత్

నాగోలు: ఫతుల్లాగూడలోని ఎనిమల్‌కేర్ సెంటర్‌లో గత వారం రోజుల్లో 30 వీధి కుక్కలు మృతి చెందాయని సోషల్ మీడియాలో వచ్చిన వార్తల్లో నిజం లేదని వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రంజిత్ తెలిపారు. శనివారం నాగోలు డివిజన్ బండ్లగూడ, ఫతుల్లాగూడలోని ఎనిమల్‌కేర్ సెంటర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఫొటోలు మార్ఫింగ్ చేయడంతో పాటు పాతఫొటోలు క్లబ్ చేసి, ఇటీవల జరిగిన ఘటనగా చిత్రీకరించారని అన్నారు. ఇక్కడ సెంటర్‌లో 800 వీధి కుక్కలను ఉంచేందుకు అవకాశం ఉందన్నారు. 600 కుక్కలకు కుటుంబ నియంత్ర ఆపరేషన్లు, గాయపడిన, అనారోగ్యంతో ఉన్న 200 కుక్కలకు చికిత్స చేసేందుకు సదుపాయాలు ఉన్నాయని డాక్టర్ రంజిత్ చెప్పారు. ప్రతిరోజూ ఇక్కడ 80 నుంచి 100 కుక్కలకు ఆపరేషన్లు, గాయాలు, అనారోగ్యాల బారినపడిన వాటికి చికిత్స అందచేస్తుంటారన్నారు. గాయపడిన, అనారోగ్యంతో ఉన్న కుక్కల్లో చికిత్స పొందుతూ ఒకట్రెండు చనిపోతుంటాయన్నారు. ఎనిమల్ కేర్ సెంటర్‌లో పూర్తిగా పారదర్శకంగా కుక్కలకు ఆపరేషన్లు, చికిత్స అందిస్తున్నామన్నారు. డాక్టర్ జేవ్యా నాయక్, వెటర్నరీ అధికారి యాదగిరి పాల్గొన్నారు.

ప్లాట్ల క్రమబద్ధీకరణకు మార్గం సుగమం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


నవీన్ మిట్టల్ తదితర ఉన్నతాధికారులతో ప్లాట్ల క్రమబద్ధీకరణపై చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: త్వరలో ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో దశాబ్దాల తరబడి పెండింగ్ ప్లాట్లు, ఇళ్ల క్రమబద్ధీకరణ సమస్యకు జీఓ 118 ప్రకారం శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ల్యాండ్ రెవెన్యూ అండ్ రిజిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాహుల్ బొజ్జా, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్స్ హరీష్, అమోయ్ కుమార్‌లను జిల్లా కలెక్టరేట్‌లో కలిసి జీఓ 118 పై ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. పెండింగ్ రిజిస్ట్రేషన్ సమస్యను ఎదుర్కొంటున్న కొన్ని ఇళ్ల, ప్లాట్లను అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో పరిశీలించారని, వారికి 15 రోజుల్లో కన్వీయాన్స్ డీడ్ అందించాలని అధికారులను సుధీర్‌రెడ్డి కోరారు. ప్లాట్ల క్రమబద్ధీకరణ సమస్య ఉన్న కాలనీల్లో అధికారులు త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. డీడ్ అందుకున్న ఇంటి యజమానులు స్టాంప్ డ్యూటీ గజానికి రూ.250లు, మ్యూటేషన్ ఫీజు రూ. 3550తో పాటు స్టాంప్ డ్యూటీపై అదనంగా 7.5 శాతం అధికారులకు నేరుగా చెల్లిస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. వెరిఫికేషన్ పూర్తయి డిమాండ్ నోటీసులు రానివారు ఈసేవ, మీసేవ లేదా.. ఆయా కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధుల వద్దకు వెళ్లి పరిశీలన చేసుకోవాలని కోరారు. జీఓ 118 సవరణ ప్రకారం సర్వే, ఇంటి నంబర్, ఇంటి యజమాని పేరు తప్పుగా వచ్చినట్‌లైతే సరిదిద్దుకునే అవకాశం కూడా ఆప్షన్‌లో కల్పిస్తారన్నారు. అధికారులను కలిసిన వారిలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, కటికరెడ్డి అరవిందరెడ్డి, బాధిత కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు రాంబాబు, జగన్‌మోహన్, అనసూయ, పుల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, శరత్‌రెడ్డి, గోపాల్ ముదిరాజ్, అంజిరెడ్డి, మల్లేష్, మల్లికార్జున్, శేఖర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మలను ప్రభుత్వం ఆదుకోవాలి


మాట్లాడుతున్న కొలే జగన్నాథం

ఎల్‌బీనగర్: విశ్వకర్మలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని, విశ్వకర్మ కౌశల్ సమాన్ యోజన పథకాన్ని తెలంగాణలో అమలు చేయాలని అఖిల భారత విశ్వకర్మ రాష్ట్ర అధ్యక్షుడు కొలే జగన్నాథం అన్నారు. శనివారం ఎల్‌బీనగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కళా నైపుణ్యం ఉన్న వృత్తులను కాపాడుకునే విధంగా ప్రతి ఒక్క విశ్వకర్మకు కౌశల్ సమాన్ యోజన వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ పథకాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్, తల్లోజు ఆచారి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్‌లకు జగన్నాథం ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి సుంకోజు లింగాచారి, అధికార ప్రతినిధి పడాల సతీష్‌చారి, భాస్కరాచారి, జంగయ్యచారి, మహిళా గౌరవ అధ్యక్షురాలు పట్నాల సావిత్రి, మహిళా కార్యదర్శి అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి


కాన్వొకేషన్‌లో పట్టా అందుకుంటున్న విద్యార్థిని

మలక్‌పేట: ఆడపిల్లలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని, అవకాశాలు అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.విజ్జులత ఆకాంక్షించారు. రవీంద్రభారతిలో శనివారం జరిగిన దిల్‌సుఖ్‌నగర్ అనిబిసెంట్ మహిళా డిగ్రీ కాలేజీ కాన్వొకేషన్, వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉజ్వల భవిష్యత్‌కు డిగ్రీ ఆరంభం మాత్రమే కావాలనీ, అంతం కాకూడదని తెలిపారు. రామన్ మెగసెసే అవార్డు గ్రహీత, రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మశ్రీ శాంత సిన్హా మాట్లాడుతూ, అమ్మాయిలు వివిధ రకాల భయాలను జయించి, లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. విద్యార్థులు ఆట, పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సూర్య ధనుజంయ్, కాలేజీ సెక్రటరీ డాక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ దయాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, లెక్చరర్లు పాల్గొన్నారు.

యేసు బోధనలు అనుసరణీయం


ముగింపు వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

సైదాబాద్: యేసు బోధనలు మానవాళి అందరికీ అనుసరణీయమని బేతేలు చర్చి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కేఆర్ పద్మారావు అన్నారు. సైదాబాద్ కాలనీలోని బేతేలు ప్రార్థనా మందిరంలో పది రోజుల పాటు నిర్వహించిన విరామ బైబిల్ పాఠశాల తరగతుల ముగింపు వేడుక శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు, వలంటీర్లు, టీచర్లతో కలిసి సైదాబాద్ కాలనీ, టూ ఆర్టీ కాలనీల్లో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో యేసుక్రీస్తు బోధనలను ప్రచారం చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం ప్రార్థనా మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పద్మారావు మాట్లాడారు. యేసు ప్రభువు జీవిత మార్గాన్ని, లక్ష్యాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం పలు అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన చిన్నారులకు ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యాధరరావు, పాస్టర్ డేవిడ్, థామస్ పాల్, పి.జేసుదాసు, నాగేశ్వరరావు, సుబ్బయ్య, రవిప్రసాద్, సుధాకర్ పాల్గొన్నారు.

చదువుకు మించిన ఆస్తి లేదు

దిల్‌సుఖ్‌నగర్: చదువుకు మించిన ఆస్తి మరొకటి లేదని, ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శనివారం కొత్తపేటలోని బాబూ జగ్జీవన్ రామ్ హాల్‌లో జరిగిన శ్రీరామ్ కళాశాల వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కళాశాల దశ ఎంతో ముఖ్యమైనది అన్నారు.గత ప్రభుత్వాలు విద్య వ్యవస్థను పట్టించుకున్న దాఖలాలు లేవు అని, ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చిన తర్వాత విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఆధ్వర్యంలో విద్య రంగ వ్యవస్థ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు.కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రమేష్ , ప్రిన్సిపల్ శ్యామల, నాగమణి, నాగలత, రవీంద్రం, నాగేశ్వరరావు, వెంకటేశం, రామశేషు, రామలక్ష్మి, సరళ ,యాదగిరి, రాజు, శ్వేత, నవనీత, మానస పాల్గొన్నారు.

హైకోర్టు పీపీకి సత్కారం



వనస్థలిపురం: తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన కొండపర్తి శ్రీనివాస్‌ను శనివారం వనస్థలిపురంలో జరిగిన కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ ఆర్‌వీ లక్ష్మి, ఉపాధ్యక్షుడు మంద సురేందర్‌రెడ్డి, పీఆర్‌ఓ బిజ్జాల యాదగిరి గుప్తా, సభ్యులు కొండ వెంకట్‌రెడ్డి, యాదగిరి యాదవ్ పాల్గొన్నారు.

డబ్బులు కావాలని ప్రజలను వేధిస్తే ఊరుకోం

ట్రాన్స్‌జెండర్స్‌కు సీఐ జలేంధర్ రెడ్డి హెచ్చరిక


జలేంధర్‌రెడ్డి

హస్తినాపురం: ట్రాన్స్ జెండర్స్ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని, వేలాది రూపాయలు కావాలని ప్రజలను కొందరు వేధింపులకు గురిచేస్తున్నారని, అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ దేవ జలేంధర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ లో సాక్షితో మాట్లాడారు. ఎక్కడ శుభకార్యాలు జరిగినా పదుల సంఖ్యలో ట్రాన్స్‌జెండర్లు చేరి రూ. 20 వేలు నుంచి రూ. 30 వేలు కావాలని డిమాండ్ చేస్తున్నారని, డబ్బులు ఇవ్వకపోతే వారితో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. వారు తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగార్జునసాగర్ రోడ్డుపై సాగర్‌కాంప్లెక్స్, గుర్రంగూడ చౌరస్తాదగ్గర , ఇంజాపూర్ రోడ్డు దగ్గర , విజయవాడ జాతీయ రహదారి ఆటోనగర్‌లో ట్రాన్స్‌జెండర్లు రాత్రి వేళల్లో తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వారి ప్రవర్తలో మార్పు తెచ్చేందుకు ఇప్పటికే పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. ఇప్పటి నుంచి పోలీస్‌స్టేషన్ పరిధిలో షాపులు ప్రారంభిస్తున్న, శుభాకార్యాలు చేసుకుంటున్న వారి వద్దకు వెళ్లి డబ్బులు కోసం వేధింపులకు పాల్పడితే సహించేది లేదని సీఐ జలేంధర్‌రెడ్డి హెచ్చరించారు.

37వ సారి రక్తదానం చేసిన ఇన్‌స్పెక్టర్ నాగమల్లు

నాగోలు: అత్యవసర సమయంలో రక్తదానం చేయడం వల్ల మరొకరి ప్రాణాలు కాపాడిన వారమవుతామని ఎల్‌బీనగర్ ట్రాఫిక్ అదనపు సీఐ అంజపల్లి నాగమల్లు అన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రిలో అత్యవసర ఆపరేషన్ ఉన్న వ్యక్తికి బ్లడ్ అవసరం కావడంతో శనివారం ఆయన వెళ్లి రక్తదానం చేశారు. నాగమల్లు ఇప్పటి వరకు 37 సార్లు రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి పునర్జన్మ నిచ్చారు.

బీఆర్‌ఎస్ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి


ముద్ద కల్యాణ్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్

హస్తినాపురం: ఎల్‌బీ నగర్ నియోజకవర్గంలో రానున్న సాధారణ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయం కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాల్సిన అవసరం ఉందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. శనివారం ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులైన ముద్ద కల్యాణ్‌కు కార్పొరేటర్ శాలువా కప్పి సత్కరించారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని కార్పొరేటర్ అన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆంజోజు సత్యంచారి, చంపాపేట డివిజన్ అధ్యక్షుడు రాజిరెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతోనే కాంగ్రెస్‌లో చేరికలు


కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో మల్‌రెడ్డి రాంరెడ్డి

చంపాపేట: రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక, నిరంకుశత్వ విధానాలతోనే బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు ఆ పార్టీని వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. శనివారం చంపాపేట డివిజన్ యాదగిరినగర్ కాలనీలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా చంపాపేటకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు 50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో రణధీర్‌రెడ్డి, వెంకటేష్‌చారి, హర్షవర్ధన్‌రెడ్డి, సన్నిత్, వినయ్ తదితరులు ఉన్నారు.

సభను జయప్రదం చేయాలి..

లింగోజిగూడ : సరూర్‌నగర్ స్టేడియంలో ఈ నెల 8న నిర్వహించే నిరుద్యోగ యువగర్జన సభకు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వస్తున్నారని, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సభను జయప్రదం చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉందని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. శనివారం చైతన్యపురిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో రాంరెడ్డి మాట్లాడారు. ఎల్‌బీనగర్‌లోని విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లకు తిరిగి నిరుద్యోగ సమస్యలను వివరించి విద్యార్థులను ఈ సభకు వచ్చేలా చేయాలని రాంరెడ్డి పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు సంకపల్లి సుధీర్‌రెడ్డి, ప్రవీన్‌రెడ్డి, కిషోర్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో నిర్వహించాలని జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కాంట్రాక్టర్లను కోరారు. డివిజన్ హయత్‌నగర్ పరిధి వీరన్నగుట్టలో చేపడుతున్న డ్రైనేజీ పనులను కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రాముఖ్య క్రమంలో ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. జలమండలి అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణలోపంతో అభివృద్ధి పనులు నాసిరకంగా జరుగుతున్నాయన్నారు. ఆకాష్‌నగర్ కాలనీ నుంచి స్వాతీ రెసిడెన్సీ వరకు సుమారు రూ.53 లక్షలతో ఎల్ షేప్ సీసీ రోడ్డు పనులకు అంచనాలు రూపొందించామని, త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తానని స్పష్టం చేశారు. వీరన్నగుట్ట బస్తీ ప్రజల దాహార్తిని తీర్చేందుకు సుమారు రూ.3 లక్షలతో పవర్‌బోర్లు మంజూరు చేయించానని, ఈ పనులను ఈ రోజు ప్రారంభించినట్లు కార్పొరేటర్ స్పష్టంచేశారు. కార్యక్రమంలో కాలనీలవాసులు కేకేఎల్‌గౌడ్, కోటయ్య, నర్సింహ, చిన్నయాదవ్, వెంకటేష్, రమేష్‌చారి, లావణ్య, రమా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేట సమగ్రాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే అహ్మద్ బలాల


ఎస్బీహెచ్-బీ కాలనీలో వాటర్ పైప్‌లైన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బలాల, కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: మలక్‌పేట నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. శనివారం ఆయన సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డితో కలిసి డివిజన్ పరిధిలోని ఎస్బీహెచ్-బీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ పైప్‌లైన్‌ను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, సైదాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వాటర్ పైప్‌లైన్, సీవరేజ్ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లో పనులు పూర్తయిన తరువాత అక్కడి రహదారులను ఆధునీకరిస్తామన్నారు. కార్యక్రమంలో పంచ కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో గుడిసె కూల్చివేత

మన్సూరాబాద్: ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే క్రిమినల్ చర్యలు చేపడతామని హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మారుతిదివాకర్ హెచ్చరించారు. మన్సూరాబాద్ గ్రామ సర్వే నంబర్ 93/1లో అక్రమంగా గుడిసే వేశారనే సమాచారం మేరకు హయత్‌నగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సుష్మిత శనివారం ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్రమంగా వేసిన గుడిసెను జేసీబీతో తొలగింపజేశారు. ఇది ప్రభుత్వ స్థలంగా సరూర్‌నగర్ రెవెన్యూ అధికారులు పేర్కొన్నారని, ఇక్కడ హెచ్ఎండీఏ పార్కుగా అభివృద్ధి చేయనుండగా, కొందరు కబ్జాదారులు గుడిసె వేయటంతో తొలగించామని మారుతిదివాకర్ తెలిపారు. కూల్చివేతలో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మాణిక్యం (ఫైల్)

నాగోలు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... బండ్లగూడ ఇంద్రప్రస్థ కాలనీలో నివాసం ఉండే నందయ్యగారి మాణిక్యం(60) రిటైర్డ్ ఉద్యోగి. రోజూ మాదిరిగానే ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి బండ్లగూడ వైపు వాకింగ్ చేసుకుంటూ వెళ్తున్నాడు. ఆనంద్‌నగర్‌లోని విజయ డయాగ్నోస్టిక్ సెంటర్ వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని కారు మాణిక్యంను వెనుక నుంచి ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఎల్‌బీనగర్ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల మహాసభను జయప్రదం చేయండి


ఆర్టీసీ కాలనీలో సమావేశమైన రిటైర్డ్ ఉద్యోగులు

వనస్థలిపురం: టీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9న హయత్‌నగర్‌లోని బొమ్మిడి నాగిరెడ్డి గార్డెన్స్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర 10వ మహాసభను విజయవంతం చేయాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఏ రహమాన్ షోఫి, ప్రధాన కార్యదర్శి బీవీ కోటయ్య, కోశాధికారి ఎస్.బుచ్చిరెడ్డి కోరారు. శనివారం వనస్థలిపురం ఆర్‌టీసీ కాలనీలో వారు విలేకరులతో మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగులు 30 వేలకు పైగా ఉన్నారని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పూనుకోవాలని అన్నారు. మెడికల్ స్కీంలో ఇప్పటి వరకు చేరని వారికి అవకాశం కల్పించాలని, అంతర్రాష్ట్ర సర్వీసులలో భార్యాభర్తలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. పెన్షన్ సౌకర్యం లేనందున ఆసరా పెన్షన్, తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మహాసభకు హోం మంత్రి మహమూద్ అలీ, వ్యవసాయ శాఖ మంత్రి ఎస్.నిరంజన్‌రెడ్డి, రవాణా శాఖా మంత్రి పి.అజయ్‌కుమార్, టీఎస్‌ఆర్‌టీసీ చైర్మన్ బి.గోవర్ధన్, అసోసియేషన్ గ్రేటర్ అధ్యక్షుడు ఎం.రాంమోహన్‌గౌడ్ తదితరులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో కె. సత్యం, బి.రామచంద్రగౌడ్, మనోహర్, యూసఫ్, సిద్దిఖీ, జాఫర్, యాదగిరి, ఎల్ఎస్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లకు భవనాలు నిర్మించాలని వినతి

మలక్‌పేట: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు భవనాలు నిర్మించాలని కోరుతూ తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్, గ్రేటర్ అధ్యక్షుడు నక్క వెంకటేష్ శనివారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. విద్యార్థి జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరాల ప్రశాంత్, రాష్ట్ర నాయకులు మేడి నాగరాజు, ప్రసాద్, వపన్, కొండల్ పాల్గొన్నారు.

9 నుంచి 'ఖేలో భారత్' పోటీలు

సైదాబాద్: యువత క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి పెంచుకోవాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి సూచించారు. ఖేలో భారత్-జీతో భాగ్యనగర్ పేరిట హైదరాబాద్ స్పోర్ట్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ యువతలో క్రీడాసక్తిని పెంపొందించే ఖేలో భారత్ పోటీల్లో భాగంగా హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో చాదర్‌ఘాట్‌లోని విక్టరీ ప్లేగ్రౌండ్స్‌లో ఈనెల 9 నుంచి మూడు రోజుల పాటు కబడ్డీ, ఖోఖో, క్రికెట్, అథ్లెట్స్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు.

కార్మికులు, రైతులు ఉద్యమించాలి: సీఐటీయూ


సభలో మాట్లాడుతున్న భూపాల్

మన్సూరాబాద్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు రైతులు సంఘటితంగా ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. మన్సూరాబాద్ డివిజన్ ఆటోనగర్‌లో శనివారం మేడే వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన భూపాల్ మాట్లాడుతూ, బ్రిటీష్ కాలంలో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నేడు బీజేపీ ప్రభుత్వం రద్దు చేసిందని, లేబర్‌కోడ్‌లను ప్రవేశపెట్టి పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటోందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు నందగిరి ఆంజనేయులు, చంద్రమోహన్, కీసరి నర్సిరెడ్డి, వీరయ్య, ఎల్లయ్య, మనోహర్, రాములు, మల్లేషం, కృష్ణ, భాస్కర్, చైతన్య, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.